# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 30-4-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:213 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

జగతిని సంరక్షించుచు
ప్రగతిని సాధించగోరు ప్రజలకు శుభముల్
ఖగవాహను డిడు గతి జరు
పగవలె నక్షయ తృతీయ పర్వ దినమునన్

(30-4-25 అక్షయ తృతీయ)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

అదుపులేక ఓటీటీల్లో
అశ్లీలం ప్రసారం
విషతీరమే సామాజిక
విలువల కాసారం
అందరికీ అందోళనే
ఆపకుంటే దాని పరుగు
నియంత్రించే సర్కారే
నిద్రపోతే ఎట్లా తరుగు



-వేల్పుల నారాయణ
9440433475

## 30న తెలంగాణలో పదో తరగతి ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 29: తెలంగాణలో పదో తరగతి ఫలితాలు విడుదల కానున్నాయి. రేపు ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టెన్త్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంది. ఈసారి మెమోలో విద్యార్థుల మార్కులు, సబ్జెక్టుల వారీగా గ్రేడ్‌లు ఇవ్వనున్నారు. కాగా, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు మొత్తం 5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

## తెలంగాణ ప్రతిష్ట పెంచేలా మిస్ వరల్డ్ పోటీలు.. రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 29:: మిస్ వరల్డ్ -2025 పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలని పార్టిసిపెంట్స్ కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మిస్ వరల్డ్ -2025 ఏర్పాట్లపై ఇవాళ అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు, తదితరులు హాజరైన ఈ సమీక్షలో.. మే 10 న ప్రారంభం కానున్న మిస్ వరల్డ్-2025 అందాల పోటీకి సంబంధించి ఏర్పాట్ల వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ఎయిర్ పోర్టు, అతిథులు బస చేసే హోటల్, కార్యక్రమాలు జరిగే చోట కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, తెలంగాణలో చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. నగరంలో పెండింగ్ లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పోటీలు నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు.



## చైనాలో ఘోర అగ్ని ప్రమాదం 22 మంది మృతి

బీజింగ్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ : చైనాలో ఘరో అగ్ని ప్రమాదం సంభవించింది. చైనాలోని లియోనింగ్ ప్రావిన్స్‌లోని ఇయాయోంగ్ నగరంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో 22 మంది మృతి చెందారు. ఈ ఘటనలో మరో ముగ్గురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్న మాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్లతో మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై స్పందించిన చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణం ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ నెలలో చైనాలో జరిగిన రెండవ అతిపెద్ద అగ్నిప్రమాదం రెస్టారెంట్ అగ్నిప్రమాదం. అంతకుముందు, ఉత్తర చైనాలోని హెబీ ప్రావిన్స్‌లోని ఒక నర్సింగ్ హోమ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 20 మంది వృద్ధులు మరణించారు.

## డిప్యూటీ సీఎం భట్టితో కొత్త సీఎస్ రామకృష్ణా రావు భేటీ



హైదరాబాద్, ఏప్రిల్ 29:తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ రామకృష్ణా రావు నియమితులైన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇవాళ ఆయన ప్రగతి భవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణా రావుకు డిప్యూటీ సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

1991 ఐఏఎస్ బ్యాచ్ కు? చెందిన రామకృష్ణా రావు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి ఆర్థిక శాఖ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. వచ్చే ఆగస్టులో ఆయన పదవీ విరమణ చేయబోతున్నారు. ఈ క్రమంలోనే సుదీర్ఘ కాలం ఆర్థిక శాఖలో చేసిన ఆయన సేవలను గుర్తించిన సర్కార్ అనుభవం దృష్ట్యా రామకృష్ణా రావును సీఎస్‌గా నియమించింది. గతంలో ఆయన నల్లగొండ జాయింట్? కలెక్టర్‌గా, గుంటూరు జిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేశారు.




# భారతీయుల ఆయుష్షు పెంచాలి ఆయుష్మాన్ భారత్ యోజన

## (30 ఏప్రిల్ "ఆయుష్మాన్ భారత్ దివస్" సందర్భంగా)

ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం "ఆయుష్మాన్ భారత్ పథకం" ప్రవేశపెట్టడంతో పేద బడుగు బలహీనవర్గాల ప్రజలకు సకాలంలో వైద్య ఆరోగ్య పరిరక్షణ చర్యలకు నడుం బిగించినట్లు అయ్యింది. ఏప్రిల్ 2018లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ పథకం నేడు లక్షల భారతీయ అట్టడుగు వర్గాలకు ఆరోగ్యాన్ని అందుబాటు ఖర్చుతో అందించే వరంగా మారింది. ఐరాస నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో భారత్ తీసుకున్న ఏ చక్కని పేదల పక్షపాత పథకంగా గత ఏడు ఏళ్లుగా కొనసాగుతున్నది. కేంద్ర రాష్ట్ర రాజకీయాలకు అతీతంగా "సమ్మిళిత వైద్య ఆరోగ్య సంరక్షణ" ధ్యేయంగా కొనసాగుతున్న ఆయుష్మాన్ భారత్ పథకం అన్ని రాష్ట్రాలకు విస్తరించవలసిన అవసరం ఉందని తెలుసుకోవాలి.

ఆయుష్మాన్ భారత్ పథక పక్షోత్సవాలు/దినోత్సవం:

అందరికీ అందుబాటులో వైద్య ఆరోగ్యం అనే నినాదంతో ప్రారంభమైన ఆయుష్మాన్ భారత్ పథకం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, అట్టుడుకుతున్న వర్గాలకు ఆ పథకం ఆరోగ్య గొడుగు పట్టడం, ఆయుష్మాన్ కార్డులను కుటుంబాలకు అందజేయడం లాంటి లక్ష్యాలను అమలు చేయడానికి ప్రతి ఏట 30 ఏప్రిల్ రోజున "ఆయుష్మాన్ భారత్ దివస్/దినోత్సవం" పాటించడంతో పాటు రెండు వారాల పాటు "ఆయుష్మాన్ భారత్ పక్షోత్సవాలు/పక్వాడా" జరుపుకోవడం 2019 నుంచి ఆనవాయితీగా మారింది. 2025 ఆయుష్మాన్ భారత్ దినోత్సవ ఇతివృత్తంగా "అందరికీ ఆరోగ్య సురక్ష – అట్టడుగు వర్గాల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం" అనే అంశాన్ని తీసుకుని ముందుకు సాగుతున్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం పరిధిలోకి అందరినీ చేర్చడానికి విస్తృతమైన ప్రయత్నాలు లేదా ప్రచారాలు నిర్వహించడం జరుగుతున్నాయి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అభాగ్యులను ఈ ఫథకంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకుంటూ, ప్రజలకు పథకానికి మధ్య దూరాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఆరోగ్యం ఓ కనీస మానవ హక్కు అని, అది విలాసం (లగ్జరీ) కాదని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించడం, పేద కుటుంబాలకు ఆయుష్మాన్ కార్డులు జారీ చేయడం, వైద్య ఖర్చులను భారీగా తగ్గించడం, గ్రామీణ వైద్య సిబ్బందిని ప్రోత్సహించడం, పేదల నమ్మకాన్ని గెలుచుకోవడం,

ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించడం కొనసాగడం సంతోషదాయకం. భారత అట్టడుగు వర్గాల్లో 55 కోట్ల లబ్ధిదారులను ఈ పథకం కిందకు తీసుకొచ్చి వారి వైద్య ఖర్చులను భారీగా తగ్గించడం జరుగుతోంది. దేశవ్యాప్తంగా 5 లక్షల కుటుంబాలు, 40 కోట్ల ఆయుష్మాన్ కార్డులు అందజేసి 31,846 ఆసుపత్రుల ద్వారా ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కీళ్ల మార్పిడి, బైపాస్ సర్జరీ లాంటి వైద్య చికిత్సలు కూడా ఈ పథకం కిందకు చేర్చబడ్డాయి.

ఆయుష్మాన్ భారత్ దివస్‌లో భాగంగా గ్రామీణ స్థాయి వరకు వైద్య శిబిరాలు, ఆరోగ్య విద్య సెమినార్లు, పౌర సమాజానికి చేరువలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఆరోగ్య భారతమే సంపన్న భారతం అనే నినాదాన్ని నిజం చేయడానికి దేహదపడుతున్న ఆయుష్మాన్ భారత్ పథకం నిరుపేద కుటుంబాలకు ఆరోగ్య ఆసరా కావాలని కోరుకుందాం, రేపటి వైద్య ఆరోగ్య సంరక్షణకు నేడే ఆయుష్మాన్ కార్డులు తీసుకుందాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



హన్మకొండ, ఏప్రిల్ 29(నేటినిజం ప్రతినిధి): చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో స్వయం వ్యక్తమై దర్శింపవచ్చిన భక్తుల పాలిట కోరిన కోర్కెలకు కొంగు బంగారముగచూ పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దివి: 29-04-2025 నుండి 10-05-2025 వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహింపబడే శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగినది. మొదటి రోజు అంకురార్పణ కార్యక్రమానికి వరంగల్ ఉమ్మడి జిల్లా మున్నూరుకాపు సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయానికి విచ్చేసిన మున్నూరుకాపు సంఘం సభ్యులు వందలాదిగా వరంగల్ జిల్లా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కటకం పెంటయ్య నేతృత్వంలో మేళతాళాలతో పట్టు చీరలు, పూజాద్రవ్యాలుఅమ్మవారికి సమర్పించి పూజాదికములు నిర్వహింపజేశారు. బ్రహ్మోత్సవాల ధ్వజారోహణకు ధ్వజపటాన్ని అత్యంత సుందరంగా తయారు చేసి ఇచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థి గంద్రాతి వర్షను ఆలయానికి విచ్చేసిన భక్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు సంఘం ప్రముఖులలో మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షులు గైనేని రాజన్, జిల్లా అధ్యక్షులు కటకం పెంటయ్య, గౌరవ సలహాదారు ఈ.వి. శ్రీనివాస్, తోట వెంకటన్న, కనుకుంట్ల రవికుమార్, బక్కి రాజ్ కుమార్, కందుల సృజన్ కాంత్, పాటి శ్రీనివాస్, కర్రు వెంకటేశ్వర్లు, మందాటి మహేందర్, పెరుకారి శ్రీధర్, వొడితెల రాము, పూజారి సత్యనారాయణ, మాడిశెట్టి వరుణ్, చందు, సతీష్, పోతు కుమారస్వామి, కొండ లక్ష్మణ్, పల్లె వంశీ మోహన్, తోట ప్రకాష్, తోట కనుకరాములు, తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు, పెండాల్స్, చల్లటి త్రాగునీరు, ఉచిత ప్రసాద వితరణ తదితర ఏర్పాటు దేవాలయ కార్యనిర్వహనాధికారి ఽ అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి తెలిపారు.

# భారత నౌకాదళానికి 26 రఫేల్-మెరైన్ విమానాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:26 'రఫేల్' పోరాట విమానాల (ఒక సీటుతో ఉండే 22 విమానాలు, రెండు సీట్లు ఉండే 4 విమానాలు)ను భారత నౌకాదళం కోసం కొనుగోలు చేయడానికి ఒక అంతర ప్రభుత్వ ఒప్పందం (ఐజీఏ) పైన భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాలు సంతకాలు చేశాయి. వీటిలో శిక్షణ, సిమ్యులేటర్, ఇతరత్రా సంబంధిత ఉపకరణాలు, ఆయుధాలతో పాటు పనితీరు ఆధారిత లాజిస్టిక్స్ సామగ్రి సైతం కలిసి ఉన్నాయి. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) దగ్గర ఇప్పటికే ఉన్న రఫేల్ విమానాలకు అవసరమైన అదనపు సామగ్రి కూడా దీనిలో భాగంగా ఉంది.

కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, ఫ్రాన్స్ ఆయుధ దళాల మంత్రి శ్రీ సెబాస్టియన్ లెకార్నూ ఐజీఏపై సంతకాలు చేశారు. న్యూఢిల్లీలోని నౌసేనా భవన్‌లో రక్షణ శాఖ కార్యదర్శి శ్రీ రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో భారత్, ఫ్రాన్స్‌ల అధికారులు ఒప్పందం ప్రతులు, విమాన ప్యాకేజీ సరఫరా ప్రోటోకాల్, ఆయుధ ప్యాకేజీ ప్రోటోకాల్‌కు సంబంధించిన సంతకాలు పూర్తయిన ప్రతులను ఈ రోజు ఇచ్చిపుచ్చుకున్నారు.

స్వయం సమృద్ధ భారత్ ('ఆత్మనిర్భర్ భారత్')ను సాకారం చేద్దామంటున్న ప్రభుత్వ దృష్టికోణానికి అనుగుణంగా, ఈ ఒప్పందంలో స్వదేశీ ఆయుధాల ఏకీకరణకుగాను టెక్నాలజీ బదలాయింపు కూడా ఒక భాగంగా ఉంది. దీనిలో రఫేల్ విమాన ముఖ్యభాగం (ఫ్యూజ్‌లేజ్) ఉత్పత్తి సదుపాయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు భారత్‌లో ఇంజిన్, సెన్సర్లు, ఆయుధాల నిర్వహణ, మరమ్మతు, ఓవర్హాల్ వంటి సదుపాయాలు కూడా కలిసున్నాయి. ఈ లావాదేవీతో ఈ తరహా సదుపాయాలు మొదలవడం వేల కొద్దీ ఉద్యోగాల కల్పనకే కాక, పెద్ద సంఖ్యలో ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు ఆస్కారం, అవి తయారుచేసే ఉత్పత్తులకు గిరాకీతోపాటు ఆదాయార్జన అవకాశాలు కూడా అందివస్తాయన్న అంచనాలున్నాయి.

ఫ్రాన్స్‌కు చెందిన డసాల్ట్ ఏవియేషన్ తయారు చేసిన పోరాట విమానం 'రఫేల్-మెరైన్'. సముద్ర ప్రాంతంలో పూర్తి స్థాయిలో పనిచేయగల సత్తా దీని సొంతం. ఈ విమానాల సరఫరా 2030కల్లా పూర్తవుతుంది. ఈ విమానాలను నడిపే సిబ్బందికి ఫ్రాన్స్‌లో, భారత్‌లో శిక్షణనివ్వనున్నారు.

భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఇప్పటికే ఉపయోగిస్తున్న రఫేల్‌తో రఫేల్-మెరైన్‌కు ఒక పోలిక ఉంది. దీనిని కొనుగోలు చేయడంతో భారత నౌకాదళంతోపాటు ఐఏఎఫ్‌కు కూడా విమాన శిక్షణ, రక్షణ సామగ్రి ఆధునిక వస్తు రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్) సంబంధిత అనుకూలతలు ఏర్పడతాయి. సంయుక్త విన్యాసాల సామర్థ్యం సైతం చెప్పుకోదగినంతగా మెరుగుపడుతుంది. రఫేల్-మెరైన్‌ను చేర్చుకోవడంతో భారత నౌకాదళ విమానవాహక నౌకల దాడి సామర్థ్యం కూడా గణనీయంగా పెరగడం ఖాయం.

# ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన విజయవంతం చేయాలి : మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



అమరావతి, ఏప్రిల్ 29:ఏపీ రాష్ట్ర రాజధాని అమరావతి పున: నిర్మాణం కోసం మే 2వ తేదీన విచ్చేయుచున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడుల మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కోరారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పర్యటనలో పాల్గొనే ప్రజల పట్ల, అమరావతి ప్రాంతంలో అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ఏర్పాట్లకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పర్యటనలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అమరావతి ప్రాంతంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులు,సిబ్బంది తగిన ఏర్పాట్లకు సిద్ధంగా ఉండాలన్నారు.

ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా తాగునీటి ఏర్పాటు, మజ్జిగ ప్యాకెట్లు, రవాణా ఏర్పాట్లు, సేద తీర్చుకునేందుకు స్టాల్స్, చలివేంద్రాల ఏర్పాటు వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల నుంచి సుమారు 90,000 మందికి పైగా పాల్గొనే అవకాశం ఉంటుందని అంచనా వేయడం జరిగిందని, వారికి ఎటువంటి లోటు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలానే పర్యటన అనంతరం సభ ముగిశాక ప్రజలు సురక్షితంగా తిరిగి వారి గమ్యస్థానాలకు చేరేలా ప్రభుత్వం భరోసా కల్పించేలా అధికారులు పనిచేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మంత్రి జనార్దన్ రెడ్డి తో పాటు గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గల్లా మాధవి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# భారతదేశ ఆవిష్కరణల రంగంలో పెద్ద ఎత్తున ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం సదస్సు లక్ష్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఏప్రిల్ 29న ఉదయం 11 గంటలకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించే యుగ్మ సమ్మేళనంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆయన సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

యుగ్మ (సంస్కృతంలో 'సంగమం' అని అర్థం) అనేది ప్రభుత్వ, విద్య, పరిశ్రమ, ఆవిష్కరణ వ్యవస్థల నాయకులను కలిపే మొట్టమొదటి వ్యూహాత్మక సమ్మేళనం. వాధ్వానీ ఫౌండేషన్, ప్రభుత్వ సంస్థల సంయుక్త పెట్టుబడితో సుమారు రూ.1,400 కోట్ల విలువైన భాగస్వామ్య ప్రాజెక్టు ద్వారా భారతదేశ ఆవిష్కరణ ప్రయాణానికి ఇది దోహదం చేయనుంది.

స్వావలంబన, ఆవిష్కరణ ఆధారిత భారతదేశం అనే ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా, ఈ సదస్సులో వివిధ కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. వీటిలో ఐఐటీ కాన్పూర్ (కృత్రిమ మేధస్సు, ఇంటెలిజెంట్ వ్యవస్థలు) , ఐఐటీ బాంబే (జీవశాస్త్రం, బయోటెక్నాలజీ, ఆరోగ్యం, వైద్యం) సూపర్‌హబ్‌లు, అగ్రశ్రేణి పరిశోధనా సంస్థల్లో పరిశోధనా వాణిజ్యీకరణను ప్రోత్సహించేందుకు వాధ్వానీ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ (డబ్ల్యుఐఎన్) కేంద్రాలు, అలాగే అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఎన్‌ఆర్ఎఫ్ )తో కలిసి చివరి దశ అనువర్తిత ప్రాజెక్టులకు సంయుక్తంగా నిధులు సమకూర్చడానికి, పరిశోధన – ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి అవకాశం ఉంది.

ఈ సదస్సులో భాగంగా ప్రభుత్వ అధికారులు, పరిశ్రమ, విద్యా రంగానికి చెందిన ప్రముఖులతో కూడిన ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్యానల్ చర్చలు కూడా జరుగనున్నాయి. పరిశోధనను వేగంగా అమలు దశకు తీసుకెళ్లే దిశగా కార్యాచరణ ఆధారిత చర్చలు, భారత్ అంతటా ఉన్న డీప్ టెక్ స్టార్టప్‌ల తాజా ఆవిష్కరణల ప్రదర్శన, విభిన్న రంగాల్లో భాగస్వామ్యాలు, సహకారాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక నెట్‌వర్కింగ్ అవకాశాలు కూడా అందుబాటులో ఉండనున్నాయి.

ఈ సదస్సులో ప్రభుత్వ అధికారులు, అగ్రశ్రేణి పరిశ్రమ, విద్యా రంగ ప్రముఖులు పాల్గొనే ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్యానల్ చర్చలు నిర్వహించనున్నారు. పరిశోధన ఫలితాలకు వేగంగా ఆచరణ రూపం కల్పించే చర్యలపై ప్రధానంగా చర్చలు జరుగుతాయి. భారత్ భారతదేశం నలుమూలల నుంచి అగ్రశ్రేణి ఆవిష్కరణలను ప్రదర్శించే డీప్ టెక్ స్టార్టప్ ఎగ్జిబిషన్, విభిన్న రంగాలలో భాగస్వామ్యాలు, సహకారాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక నెట్‌వర్కింగ్ అవకాశాలు కూడా ఈ కార్యక్రమంలో భాగంగా ఉంటాయి.

భారతదేశ ఆవిష్కరణ వ్యవస్థలో భారీ స్థాయి ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం, అగ్రస్థానంలో ఉన్న సాంకేతిక రంగంలో పరిశోధనను వాణిజ్యపరమైన దశకు వేగవంతంగా తీసుకెళ్లడం, విద్యా-పరిశ్రమ-ప్రభుత్వ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, ఏఎన్ఆర్ఎఫ్, ఎఐసిటిఇ ఇన్నోవేషన్ వంటి జాతీయ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం, అన్ని సంస్థల ఆవిష్కరణలను ప్రజలకు అందుబాటులో ఉంచడం, 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు జాతీయ ఆవిష్కరణ దిశలో ఏకీకృత కృషిని ప్రోత్సహించడం వంటి ప్రధాన లక్ష్యాలతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.

# విద్యను ప్రతి ఒక్కరి చెంతకు చేర్చే ముఖ్య అందజేత యంత్రాంగం 'జ్ఞాన్ పోస్ట్': శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:'జ్ఞాన్ పోస్ట్'కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రచురించినట్లు కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ మంత్రి మాన్య శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా ప్రకటించారు. విద్యాసంబంధ పుస్తకాలను, సామాజిక, సాంస్కృతిక, ధార్మిక పుస్తకాలను దేశమంతటా తక్కువ ఖర్చులో అందించడం ఈ కొత్త సేవతో సాధ్యపడుతుంది. దేశంలో ప్రతి ప్రాంతంలోనూ విద్యకు మద్దతును అందించడంతోపాటు చదువుకోవాలన్న ఆరాటం ఉన్నవారి వద్దకు చేరుకోవడానికి ఇండియా పోస్ట్ కనబరుస్తున్న నిరంతర నిబద్ధతకు ఈ నూతన సేవ అద్దంపడుతోంది.

విద్య ఒక శక్తిమంతమైన భవితకు పునాది వేస్తుంది. అయితే విద్యను అభ్యసించే వనరుల ప్రాప్తి భోగోళిక పరిస్థితి, లేదా కొనుగోలు సామర్థ్యం వంటి అంశాలపైన ఆధారపడి ఉండకూడదు. ఒక పాఠ్యపుస్తకాన్ని గాని, ఒక మార్గదర్శనాన్నిచ్చే గైడ్‌ను గాని, లేదా ఒక సాంస్కృతిక గ్రంథాన్ని అయినా సరే చివరి దశ వరకు... చాలా దూరంలో ఉన్న పట్టణానికి లేదా పల్లెకు సైతం... చేర్చగలగాలన్న విశ్వాసంతో 'జ్ఞాన్ పోస్ట్'ను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా మాట్లాడుతూ, "నూతన విద్యావిధానం, సిలబస్‌లలో భాగంగా 'జ్ఞాన్ పోస్ట్' ప్రతి ఒక్కరి వద్దకు విద్యను చేర్చగలగడానికి ఒక ముఖ్య బట్వాడా యంత్రాంగం పాత్రను పోషిస్తుంద"న్నారు.

నేర్చుకోవడంలోనూ, జ్ఞానాన్ని పంచుకోవడంలోనూ సాయపడడానికి రూపొందించిన 'జ్ఞాన్ పోస్ట్' భారత విస్తృత తపాలా నెట్‌వర్క్ ద్వారా పుస్తకాలను, ముద్రణ పూర్తి అయిన విద్యాసంబంధిత సామగ్రిని చేరవేయడానికి చౌకైన ఐచ్ఛికాలను అందుబాటులోకి తీసుకువస్తుంది. దీనికి ధరను నిర్ణయించేటప్పుడు, సాధ్యమైనంత ఎక్కువ మందికి చేరుకొనేటట్లు ఈ సేవను ప్రోత్సహించాలనే సంగతిని దృష్టిలో పెట్టుకున్నారు.

'జ్ఞాన్ పోస్ట్'లో భాగంగా పంపే పుస్తకాలు, ముద్రణ పూర్తయిన విద్యా సంబంధ సామగ్రిని అది ఏ సమయానికి ఎక్కడికి చేరుకొందీ తెలుసుకొనే ఏర్పాటు కూడా చేశారు. దీనిని తక్కువ ఖర్చుతో ప్రభావవంతంగా బట్వాడా చేసేందుకు వీలుగా ఉపరితల పద్ధతిలో కూడా రవాణా చేసేందుకు వెసులుబాటు కల్పించారు. ప్యాకేజీలలో 300 గ్రాముల బరువు ఉన్న ప్యాకెట్లు కేవలం రూ.20తో మొదలై, 5 కిలోల వరకు ఉండే ప్యాకెట్లనయితే గరిష్ఠంగా రూ.100తో (పన్నులు వర్తిస్తాయి) చాలా చౌక ధరలకు పంపించవచ్చు.

'జ్ఞాన్ పోస్ట్' ద్వారా కేవలం వాణిజ్యేతరమైన, విద్యాసంబంధిత సామగ్రినే పంపాలి.

ఏదైనా వ్యాపార, వాణిజ్య సంబంధిత ప్రచురణలు, లేదా ప్రకటనలు (అకస్మాత్తుగా ప్రకటించాల్సిన సంగతులు లేదా పుస్తకాల జాబితాలు వంటివి తప్ప) 'జ్ఞాన్ పోస్ట్'లో పంపడం కుదరదు. ప్రతి ఒక్క పుస్తకం నిర్దేశిత షరతులను పాటిస్తూ ముద్రాపకుడు లేదా ప్రచురణకర్త పేరును తెలియజేయాల్సిందే. సర్వజనులకు సేవలను అందించాలన్న ఇండియా పోస్ట్ నిబద్ధతను 'జ్ఞాన్ పోస్ట్' పునరుద్ఘాటిస్తోంది. ఈ పద్ధతిలో చేరవేసే ఒక్కొక్క పుస్తకం రూపంలోనూ విద్యపరమైన అంతరాలను క్రమంగా తగ్గిస్తూ పోవడం సాధ్యమవుతుంది. విద్యను నేర్పే వనరులను ఇదివరకటి కంటే మరింత సులభంగానూ, తేలికగానూ మార్చివేస్తూ, ఇండియా పోస్ట్ యావత్తు దేశంలో వ్యక్తులతోపాటు సముదాయాలకు సాధికారితను సంతరించడంలో తన వారసత్వాన్ని ఇకమీదటా కొనసాగిస్తుంది.




# నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడి ముగ్గురి మృతి

తిరుపతి, ఏప్రిల్ 29: నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి పడి ముగ్గురు మృతిచెందిన విషాద ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. రాష్ట్రంలోని తిరుపతి మంగళం సమీపంలో ప్రమాదం చోటు చేసుకుంది. తుడా క్వార్టర్స్ లో .. నిర్మాణంలో ఉన్న హెచ్ఐజీ భవనం పైనుంచి కిందపడి ముగ్గురు కార్మికులు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# పీ4 మహా యజ్ఞంలో తొలి అడుగు

-కలెక్టర్ లక్ష్మీశ



అమరావతి, ఏప్రిల్ 29:: సమాజంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించాలనే గొప్ప లక్ష్యంతో సీఎం చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా ప్రభుత్వం ప్రారంభించిన పీ4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమంలో మరో గొప్ప ముందడుగు పడింది. రాష్ట్రంలోనే తొలిసారిగా నందిగామ నియోజకవర్గం, ముప్పాళ్లలో బంగారు కుటుంబాలకు మార్గదర్శుల ద్వారా సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేవలం ఆర్థిక సహాయం అందించి ఊరుకోవడమే కాదు.. ఓ పేద కుటుంబాన్ని పేదరికం నుంచి పూర్తిగా బయటపడే వరకు, ఆర్థికంగా నిలదొక్కుకొని సమాజంలో సగర్వంగా నిలబడేవరకు, ఆ కుటుంబం కూడా మార్గదర్శిగా ఎదిగేందుకు మార్గదర్శులు భరోసా కల్పించే ఈ బృహత్తర కార్యక్రమంలో తొలిగా నలుగురు మార్గదర్శులు తాము దత్తత తీసుకున్న కుటుంబాలకు సహాయం అందించారు.

కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య.. మార్గదర్శులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి క్రక్స్ బయోటెక్ ద్వారా పగడాల నాగరత్నం కుటుంబానికి, సెంటిని బయో ప్రొడక్ట్స్ ద్వారా కొండ్రు వెంకటరావమ్మ కుటుంబాలకు ఆటోలు అందజేశారు. ప్లైవుడ్ కంపెనీ ద్వారా పగడాల నాగరత్నం, కొండ్రు వెంకటరావమ్మ, ఉప్పెల్లి నాగజ్యోతి, బొబ్బా శ్రీలక్ష్మి, పగడాల ప్రియాంక, బోల్నిది శిరీషలకు కుట్టు మిషన్లు అందజేశారు. అంబా కోచ్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా బంగారు కుటుంబ సభ్యులు కె.లక్ష్మయ్య, కె.రమాదేవి దంపతలకు ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. అదేవిధంగా మరో 9మందికి అవసరమయ్యే మందులతో మెడికల్ కిట్లు అందజేశారు.

చేయిపట్టి నడిపించే మిషన్ పీ4.

బంగారు కుటుంబాలు స్వయం సమృద్ధి సాధించేందుకు చేసిన ఈ సహాయపు చిన్న అడుగు పేదల జీవితాల్లో గొప్ప వెలుగు అని, ఈ స్ఫూర్తితో మరో నాలుగు లక్షల మంది మార్గదర్శులు ముందుకు రావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఎన్‌టీఆర్ జిల్లాలోని 96 వేల కుటుంబాలు అభివృద్ధి చెందే వరకు కొనసాగుతుందని, ఆయా కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానించి, సమాజంలో ఉన్నతంగా ఎదిగే వరకు మార్గదర్శుల ద్వారా సహాయ సహకారాలు అందుతాయన్నారు. ఉదాహరణకు బంగారు కుటుంబంలో ఏడో తరగతి చదువుతున్న ఓ అమ్మాయికి డాక్టర్ కావాలనే కోరిక ఉంటుందని, ఆ చిన్నారి డాక్టర్ కలను సాకారం చేసుకునేందుకు ఏ కాలేజీలో చేరాలి? ఏ కోర్సు చేయాలి? శిక్షణ ఎక్కడ తీసుకోవాలి? ఇలా ప్రతి విషయంలోనూ మార్గదర్శి చేయిపట్టి నడిపించే ఓ విశిష్ట కార్యక్రమం పీ4 అని వివరించారు. మార్గదర్శులు అందించే ప్రతి రూపాయి, ప్రతి సాయం అత్యంత పారదర్శకతతో మార్గదర్శులకు వెళ్తుందన్నారు.

గొప్ప విజనరీ సీఎం చంద్రబాబు

గొప్ప దార్శనికత ఉన్న ముఖ్యమంత్రిగా మన ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రపంచ వ్యాప్త గుర్తింపు ఉందని, మనం రేపటి గురించి ఆలోచిస్తే ఆయన 20సంవత్సరాల తర్వాత గురించి కూడా ఆలోచిస్తారని నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. బంగారు కుటుంబాలను గుర్తించడం, వారిని మార్గదర్శికళకు అనుసంధానం చేయడం కలెక్టర్ సారథ్యంలో పీ4 కార్యక్రమం ఇలా ముందుకెళ్తుండటం చాలా ఆనందం కలిగిస్తోందన్నారు.

# ఏపి సీఐడీలో 28 హోంగార్డు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి, ఏప్రిల్ 29: ఏపి రాష్ట్ర సీఐడీ విభాగంలో 28 హోంగార్డుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మే 1 నుంచి 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్ చెప్పారు.

అర్హతలు:ఏపీకి చెందిన వారై ఉండాలి.వయోపరిమితి: 18–50 ఏళ్ల మధ్య (2025 మే 1 నాటికి) ఉండాలి.ఎత్తు: పురుషులు 160 సెం.మీ. మహిళలు 150 సెం.మీ. (ఎస్టీ మహిళా అభ్యర్థులకు 5 సెం.మీ. మినహాయింపు) కనీస విద్యార్హత ఇంటర్మీడియట్, బీటెక్, ఎంసీఏ, బీసీఏ, బీఎస్సీ కంప్యూటర్స్ చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. కంప్యూటర్ నైపుణ్యాలు, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ధ్రువపత్రాల పరిశీలనతో పాటు శారీరక కొలతల పరీక్ష, కంప్యూటర్, టైపింగ్, డ్రైవింగ్ నైపుణ్యాలపై పరీక్ష ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు రోజుకు రూ.710 చొప్పున డ్యూటీ అలవెన్స్ చెల్లిస్తారు.

ధరకాస్తులు పంపాల్సిన చిరునామా: డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్, ఆంధ్రప్రదేశ్, ఏపీ పోలీసు హెడ్ క్వార్టర్స్, మంగళగిరి–522503 చిరునామాకు నేరుగా లేదా రిజిస్టర్డ్ పోస్టులో దరఖాస్తులు సమర్పించొచ్చని సూచించారు. పూర్తి వివరాలకు 94407 00860 నంబర్ను సంప్రదించాలని ఓ ప్రకటనలో తెలిపారు.

# ఎంఎస్ఎంఇ వివాద పరిష్కార పుస్తకాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి అర్జున్ మేఘవాల్



హైదరాబాద్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );, ఇండియా - భారత ప్రభుత్వం న్యాయ మరియు న్యాయశాఖ గౌరవ మంత్రి శ్రీ అర్జున్ మేఘవాల్ హైదరాబాద్‌లో "ఎంఎస్ఎంఇ అభివృద్ధి చట్టం (2006) ప్రకారం ఆలస్యం అయిన చెల్లింపులపై వివాద పరిష్కారం పట్ల రెడీ రెకనర్" పుస్తకాన్ని అధికారికంగా ఆవిష్కరించారు. ఆసియా లా హౌస్ ప్రచురించిన ఈ విస్తృత మార్గదర్శిని, టీఐహెచ్‌సీఐఎల్ వ్యవస్థాపక డైరెక్టర్ డా. బి. యెర్రం రాజు మరియు క్రక్స్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ మిస్ హేమా జైన్ సంయుక్తంగా రచించారు. ఈ పుస్తకం, భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి, ఉపాధి సృష్టికి కీలకమైన మైక్రో, స్మాల్, మిడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఇలు) ఎదుర్కొంటున్న ఆలస్యం అయిన చెల్లింపుల సమస్యను పరిష్కరించేందుకు దోహదపడుతుంది. ఇలాంటి ఆలస్యం డబ్బుల ప్రవాహాన్ని అడ్డుకుంటూ, ఆపరేషనల్ సామర్థ్యాన్ని అడ్డుకుంటూ, ఎంఎస్ఎంఇల స్థిరత్వాన్ని ప్రమాదంలో పడేస్తోంది. ప్రస్తుతం ఎంఎస్ఎంఇ సమాధాన్ పోర్టల్‌లో 20,000 పైగా కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటి మొత్తం విలువ సుమారు ?40,000 కోట్లు. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి అర్జున్ మేఘవాల్ రచయితల కృషిని ప్రశంసించారు. ఎంఎస్ఎంఇలు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నాయని, వాటి దోహదాన్ని గరిష్టంగా పొందేందుకు అనుకూలమైన వాతావరణం అవసరమని ఆయన అన్నారు. మిస్ హేమా జైన్ గారి సుదీర్ఘ వ్యాపార అనుభవం, ఎంఎస్ఎంఇలకు ఆమె అందిస్తున్న మెంటరింగ్‌ను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ పుస్తకం ఎంఎస్ఎంఇలు, పాలసీ మేకర్లు మరియు పరిశ్రమ అనుబంధ భాగస్వాములకు విలువైన వనరుగా నిలవనుంది. ఆలస్యం అయిన చెల్లింపుల సమస్యను పరిష్కరించి, మరింత అనుకూలమైన వ్యాపార వాతావరణాన్ని ఏర్పరచే దిశగా ఇది తోడ్పడుతుంది. కార్యక్రమంలో హేమా జైన్ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఇలు ఎకానమీకి వెన్నెముకలుగా ఉన్నప్పటికీ, ఇంకా మెరుగైన మద్దతు అవసరమని అన్నారు. వ్యాపారాన్ని సులభతరం చేయడంలో ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, ఎంఎస్ఎంఇల సామర్థ్యాన్ని పూర్తిగా విడుదల చేయాలంటే ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. పెద్ద కంపెనీల పోటీ సామర్థ్యాన్ని పెంచడంలో కూడా ఎంఎస్ఎంఇల పాత్ర ఉందని, అవి దేశ ఆర్థిక వృద్ధిని 10% వరకు నడిపించగలవని తెలిపారు. ఎంఎస్ఎంఇల వృద్ధి మరిన్ని ఉద్యోగాలను సృష్టించే ప్రభావాన్ని కలిగిస్తుందని ఆమె పేర్కొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు : ఎమ్మెల్యే గండ్ర

వరంగల్, ఏప్రిల్ 29: రైతులు పండించిన వరి పంట మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలని, దళారులను నమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. మంగళవారం మండలంలోని నైన్ పాక, జడల్ పేట, ఒడితల, ధూత్ పల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ, ఓడిసియంఎస్, మ్యాక్స్ సొసైటీ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రారంభించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని ఆయన కోరారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, చిట్యాల మార్కెట్ చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ నేతలు, గుట్ల తిరుపతి, ముక్కిరాల మధు వంశీకృష్ణ, కామిడీ రత్నాకర్ రెడ్డి, అల్లకొండ కుమార్, పీఏసీఎస్ సీఓ మెరుగు మొగిలి, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులున్నారు.

# అర్హులైన అసంఘటిత కార్మికులకు లేబర్ కార్డు ఉండేలా కార్మిక చట్టం లో మార్పు

## రెడ్డిని టి పి సి సి లేబర్ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కాందాడి సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ముఖ్యమంత్రి ప్రజా వ్యవహారాలు, ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని టి పి సి సి లేబర్ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కాందాడి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్ పల్లి నియోజకవర్గం లేబర్ సెల్ అధ్యక్షులు సప్పిడి భాస్కర్ గారి తో కలసి టి పి సి సి లేబర్ సెల్ మరియు ఎఐయుజఅ తరపున వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర కార్మికుల సంక్షేమనీ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా మీ ద్వారా కార్మిక చట్టం లో మార్పు తీసుకొచ్చి భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ యజమానులకు, డెవలపర్స్, కాంట్రాక్టర్స్, బిల్డర్స్, లకు సంబంధిత శాఖ ల ద్వారా ప్రత్యేక షరతులు విధించి అర్హులైన ప్రతిఒక్క గృహ నిర్మాణ కార్మికుడికి తప్పనిసరిగా బిఅచి వెల్ఫేర్ కార్డు ఉంటేనే పని కొనిసాగించాలని పేర్కొన్నారు. కార్మిక చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఉత్తర్వులు జారీ చేస్తే కార్మికులకు వారి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే కార్మికులకు అవగాహన కోసం సోషల్ మీడియా, టి వి, సినిమా హాల్స్ లో ప్రకటనలు, పత్రిక ప్రకటనలు కార్మిక శాఖ ద్వారా ప్రచారం చేసి అర్హులైన గృహ నిర్మాణ కార్మికులకు మరియు ఇతర రంగ కార్మికులకు భీమా పథకాలలో చేరడానికి తెలంగాణ రాష్ట్రం లో ప్రతి నియోజకవర్గం లో కార్మిక శాఖ ద్వారా ప్రత్యేక కౌంటర్లు పెట్టి కార్మికులకు లబ్ది చేయగలరని విజ్ఞప్తి చేశారు. మరియు తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారం కార్మిక చట్టం పరిధిలోకి వచ్చు అర్హులైన ప్రతి ఒక్క కార్మికుడికి,సంఘటిత, అసంఘటిత కార్మికులు, వీధి వ్యాపారులకు, తప్పనిసరిగా వారిని కార్మిక భీమా పథకం లో చేరే విధంగా మార్పులు చేసి కొత్త పథకాలు అమలు చేయాలని వారు అభ్యర్థించారు



# పేద విద్యార్థికి వెస్సో ట్రస్ట్ లాప్టాప్ బహూకరణ

హైదరాబాద్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గుంటూరు జిల్లా నందిపాడు కు చెందిన జానా సత్యనారాయణ టైలరింగ్ చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటారు. ఆయన ఇద్దరు కొడుకులలో పెద్ద కొడుకు ప్రశాంత్ ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రత్యేక విషయం గా) గుంటూరు చలపతి ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు. ప్రశాంత్ చదువుకు లాప్టాప్ చాలా అవసరం, కానీ లాప్టాప్ కొనుక్కునే ఆర్థిక స్థోమత అతనికి లేదు. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ కు చెందిన ఎస్బిఐ విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మరియు సామాజిక సేవకులు డాక్టర్ అమ్మనబోలు పూర్ణచంద్రరావు బాపట్ల జిల్లా మార్టూరులోని అమ్మ ఆశ్రమం సందర్శించినప్పుడు సత్యనారాయణ ఇందిర దంపతులు వారికి తమ ఆర్థిక సమస్య తెలియజేసి తమ కుమారుడు ప్రశాంత్ కు లాప్టాప్ డొనేట్ చేయమని కోరారు. పర్యవసానం గాహైదరాబాద్ మధుర నగర్ శ్రీ సాయి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్ వద్ద ఈరోజు జరిగిన సేవా కార్యక్రమంలో డాక్టర్ పూర్ణచంద్ర రావు విద్యార్థి ప్రశాంత్ తల్లి ఇందిర కు లాప్టాప్



బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమానికి వెస్సో ట్రస్ట్ సంస్థాపక అధ్యక్షులు బంగారు తాతారావు, ఎస్బిఐ విశ్రాంత ఉద్యోగి విజయసింహ సుశీల దంపతులు ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ డాక్టర్ పూర్ణచంద్ర రావు సంఘీయుల మీద అభిమానంతో వారి సంక్షేమాని కి, అభివృద్ధికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఎన్నో సేవా కార్యక్రవ నాలలో పాల్గొంటున్నారని, ముఖ్యంగా వెస్సో ట్రస్ట్, విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్, విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ వంటి సేవా సంస్థలకు తమ విరాళాలను అందజేస్తూ పలు విధమైన సేవా కార్యక్రమాలకు అండగా ఉంటున్నారని, వారికి ఈ సందర్భంగా సంఘీయుల తరఫున ధన్యవాదములు తెలిపారు.

# మేక్ ఏఐ ఇన్ ఇండియా అనే దార్శనికతపై మేము పని చేస్తున్నాము.. మరియు మా లక్ష్యం- మేక్ ఏఐ ఫర్ ఇండియా: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన జజఉఓ ఇన్నోవేషన్ కాన్క్లేవ్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, ప్రభుత్వ అధికారులు, విద్యావేత్తలు మరియు సైన్స్ మరియు పరిశోధన నిపుణుల ముఖ్యమైన సమావేశాన్ని హైలైట్ చేశారు, "జజఉఓ"గా వాటాదారుల సంగమాన్ని నొక్కి చెప్పారు - అభివృద్ధి చెందిన భారతదేశం కోసం భవిష్యత్తు సాంకేతికతలను ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకున్న సహకారం. భారతదేశం యొక్క ఆవిష్కరణ సామర్థ్యాన్ని మరియు డీప్-టెక్‌లో దాని పాత్రను పెంచే ప్రయత్నాలు ఈ కార్యక్రమం ద్వారా ఊపందుకుంటాయని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ०ఐ, ఇంటెలిజెంట్ సిస్టమ్స్ మరియు బయోసైన్సెస్, బయోటెక్నాలజీ, ఆరోగ్యం మరియు వైద్యంపై దృష్టి సారించి, ఎమ్ కాన్పూర్ మరియు ఎమ్ బాంబేలో సూపర్ హబ్‌ల ప్రారంభోత్సవం గురించి ఆయన వ్యాఖ్యానించారు. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌తో కలిసి పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడానికి నిబద్ధతను పునరుద్ఘాటించే వాధ్వానీ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ప్రారంభాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న వాధ్వానీ ఫౌండేషన్, ఐఐటీలు మరియు అన్ని వాటాదారులను ప్రధానమంత్రి అభినందించారు. ప్రైవేట్ మరియు ప్రభుత్వ రంగాల సహకారం ద్వారా దేశ విద్యా వ్యవస్థలో సానుకూల మార్పులను పెంపొందించడంలో శ్రీ రోమేష్ వాధ్వానీ అంకితభావం మరియు చురుకైన పాత్ర పోషించినందుకు ఆయన ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు.

నిజమైన జీవితం సేవ మరియు నిస్వార్థతలో జీవించడం అంటే సంస్కృతంలో ఉన్న గ్రంథాలను ఉటంకిస్తూ, సైన్స్ మరియు టెక్నాలజీ సేవకు మాధ్యమాలుగా కూడా పనిచేయాలని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. వాధ్వానీ ఫౌండేషన్ వంటి సంస్థలు, భారతదేశంలో సైన్స్ మరియు టెక్నాలజీని సరైన దిశలో నడిపించిన శ్రీ రోమేష్ వాధ్వానీ మరియు అతని బృందం ప్రయత్నాలను చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విభజన తర్వాత పరిస్థితులు, తన జన్మస్థలం నుండి స్థానభ్రంశం, బాల్యంలో పోలియోతో పోరాడటం మరియు భారీ వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించడానికి ఈ సవాళ్లను అధిగమించడం వంటి పోరాటాలతో కూడిన శ్రీ వాధ్వానీ అద్భుతమైన ప్రయాణాన్ని ఆయన హైలైట్ చేశారు. భారతదేశ విద్య మరియు పరిశోధన రంగాలకు తన విజయాన్ని అంకితం చేసినందుకు శ్రీ వాధ్వానీని శ్రీ మోదీ ప్రశంసించారు, దీనిని ఒక ఆదర్శప్రాయమైన చర్యగా అభివర్ణించారు. పాఠశాల విద్య, అంగన్‌వాడీ టెక్నాలజీలు మరియు వ్యవసాయ-టెక్ చొరవలకు ఫౌండేషన్ చేసిన సహకారాన్ని ఆయన గుర్తించారు. వాధ్వానీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్థాపన వంటి కార్యక్రమాలలో ఆయన గతంలో పాల్గొన్నట్లు ఆయన గుర్తించారు మరియు ఫౌండేషన్ భవిష్యత్తులో అనేక మైలురాళ్లను సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు మరియు వాధ్వానీ ఫౌండేషన్ వారి ప్రయత్నాలకు తన శుభాకాంక్షలు తెలిపారు.

ఏ దేశ భవిష్యత్తు అయినా దాని యువతపై ఆధారపడి ఉంటుందని, భవిష్యత్తుకు వారిని సిద్ధం చేయడం యొక్క ప్రాముఖ్యతను గుర్తించిన ప్రధానమంత్రి, ఈ తయారీలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని వ్యాఖ్యానించారు మరియు 21వ శతాబ్దపు అవసరాలను తీర్చడానికి భారతదేశ విద్యా వ్యవస్థను ఆధునీకరించే ప్రయత్నాలను నొక్కి చెప్పారు.

ప్రపంచ విద్యా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కొత్త జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని ఆయన హైలైట్ చేశారు మరియు అది భారతీయ విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన గణనీయమైన మార్పులను గుర్తించారు. ఒకటి నుండి ఏడవ తరగతి వరకు జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం, అభ్యాస బోధనా సామగ్రి మరియు కొత్త పాఠ్యపుస్తకాల అభివృద్ధి గురించి ఆయన వ్యాఖ్యానించారు. ఖఓవ-విద్య మరియు ఆఐఖఊం ప్లాట్‌ఫారమ్‌ల కింద ०ఐ-ఆధారిత మరియు స్కేలబుల్ డిజిటల్ విద్యా మౌలిక సదుపాయాల వేదిక - 'వన్ నేషన్, వన్ డిజిటల్ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' సృష్టిని ఆయన హైలైట్ చేశారు, ఇది 30 కి పైగా భారతీయ భాషలు మరియు ఏడు విదేశీ భాషలలో పాఠ్యపుస్తకాలను తయారు చేయడానికి వీలు కల్పిస్తుంది. నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ విద్యార్థులు ఒకేసారి విభిన్న విషయాలను అధ్యయనం చేయడాన్ని సులభతరం చేసిందని, ఆధునిక విద్యను అందించిందని మరియు కొత్త కెరీర్ మార్గాలను తెరుస్తుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. జాతీయ లక్ష్యాలను సాధించడానికి భారతదేశ పరిశోధన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు, 2013-14లో ఖీడఆపై స్థూల వ్యయాన్ని ?60,000 కోట్ల నుండి ?1.25 లక్షల కోట్లకు రెట్టింపు చేయడం, అత్యాధునిక పరిశోధనా పార్కుల ఏర్పాటు మరియు దాదాపు 6,000 ఉన్నత విద్యా సంస్థలలో పరిశోధన మరియు అభివృద్ధి కణాల సృష్టిని హైలైట్ చేశారు. భారతదేశంలో ఆవిష్కరణ సంస్కృతి వేగంగా అభివృద్ధి చెందుతోందని ఆయన వ్యాఖ్యానించారు, 2014లో దాదాపు 40,000 ఉన్న పేటెంట్ దాఖలు 80,000 కు పెరిగిందని, ఇది యువతకు మేధో సంపత్తి పర్యావరణ వ్యవస్థ అందించే మద్దతును ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా సామ జగన్ మోహన్ రెడ్డి వర్ధంతి



హైదరాబాద్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); అఖిల భారతీయ విద్యార్థి పరిషత్-సికింద్రాబాద్ జిల్లా, మారేడుపల్లి శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండాకోసం నరహంతక నక్సలైట్ల చేతిలో అమరుడైన సామ జగన్ మోహన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్కబాలు ముఖ్య అతిధిగా హాజరైనారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ 29 ఏప్రిల్ 1982 నక్సలైట్ల అరాచకం కాకతీయ విశ్వవిద్యాలయం లో కూడా పాకింది అందులో ఉన్న చాలా మంది విద్యార్థినీ విద్యార్థులను నక్సల్ వైపు తిప్పడానికి చాలా ప్రయత్నాలు జరిగాయన్నారు. ఒక రోజు జనవరి 26 నాడు జాతీయ జెండా కు బదులుగా నల్ల జెండా ఎగరవేయడం జరిగింది అక్కడే ఉన్న చాలా మంది విద్యార్థులు ప్రొఫెసర్లు ఎవరు నోరు మెదపలేదు. ఆ అరాచకం చూడలేని సామ జగన్మోహన్ రెడ్డి ముందుకు వచ్చి వాళ్లతో పోరాటం చేసి జాతీయ జెండా ఎగురవేసిన ఘనత సామా జగన్మోహన్ అన్నదే నాన్నారు. దాన్ని సహించలేని నక్సల్స్ సామా జగన్మోహన్ రెడ్డి అన్న ను చాలా రకాలుగా బెదిరింపులు చాలా ఇబందులకి గురి చేశారు సామా జగన్ మోహన్ అన్న ఆ బెదిరింపులకు బెదరకుండా ముందుకు వెళ్లి వాళ్ల పై చర్య తీసుకోవాలని కోర్టులో కేసు వేయడం జరిగింది కోర్టులో కేస్ గెలుచుకొని వస్తున్న క్రమంలో హనుమకొండ అంబేద్కర్ చౌక్ దగ్గర సామా జగన్మోహన్ రెడ్డిని కిరాతకంగా 35 కత్తి పోట్లతో చంపడం జరిగింది. నేటి విద్యార్థులు కూడా సామా జగనన్న గారిని స్ఫూర్తిదాయకంగా తీసుకొని దేశం పట్ల చిత్తశుద్ధితో అడుగులు వేయాలని చెప్పి వారు విద్యార్థులకు సందేశం ఇచ్చారు ఈ కార్యక్రమం లో మారేడుపల్లి టౌన్ సెక్రటరీ ప్రణయ్ కుమార్, కాలేజ్ సెక్రెటరీ చందన్ కుమార్, సుశాంత్, సాయి, నిఖిల్ మరియు ఇతరులు పాల్గొన్నారు..

# భారతదేశం అంతటా సాంప్రదాయ ఆరోగ్య సంరక్షణ డెలివరీని బలోపేతం చేయడానికి రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు సహకరించాయి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ, మహారాష్ట్రలోని లోనావాలాలోని కైవల్యధాంలో 2025 మే 1-2 తేదీలలో జాతీయ ఆయుష్ మిషన్ (ఔంఓ) కాన్క్లేవ్‌ను నిర్వహించనుంది. ఈ పరివర్తనాత్మక 2 రోజుల కార్యక్రమం భారతదేశంలో ఆయుష్ ఆధారిత ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును రూపొందించడానికి ఒక జాతీయ వేదికగా ఉపయోగపడుతుంది. ఆయుష్ నిపుణులు, విధాన నిర్ణేతలు, ఆరోగ్య నిపుణులు, పరిశోధకులు మరియు ఆవిష్కర్తలను ఒకచోట చేర్చి, సాంప్రదాయ భారతీయ వైద్య వ్యవస్థలను ప్రధాన స్రవంతి ఆరోగ్య సంరక్షణలో ఏకీకరణను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది - సాధారణ పౌరులకు ఆరోగ్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడం, సరసమైనది మరియు సాక్ష్యాధారాలతో నడిచేలా చేయడం.

ఈ కాన్క్లేవ్‌ను ఆయుష్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) శ్రీ ప్రతాపరావు జాదవ్ ప్రారంభించనున్నారు, రాజస్థాన్ ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి మరియు భారతదేశంలోని తొమ్మిది రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఆరోగ్య మంత్రులు కూడా ఈ కాన్క్లేవ్‌కు హాజరు కానున్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటేచా మరియు ఇతర ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్ర/కేంద్ర పాలిత ప్రాంతాల ఆయుష్ విభాగాల అధికారులు, మిషన్ డైరెక్టర్లు, సీనియర్ ప్రభుత్వ అధికారులు మరియు ప్రఖ్యాత విద్యావేత్తలు కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్లీనరీ సెషన్‌లు, పాలసీ రౌండ్‌టేబుల్స్, సాంకేతిక లోతైన చర్చలు, ఆయుష్ రంగంలో ఉత్తమ పద్ధతులు, రాష్ట్ర విజయగాధలు మరియు సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలను ప్రదర్శించడానికి ప్రణాళిక చేయబడింది.

రాబోయే కార్యక్రమం గురించి ఆయుష్ మంత్రి మాట్లాడుతూ, "దేశవ్యాప్తంగా ఆరోగ్యం మరియు ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి సహకార పర్యావరణ వ్యవస్థను పెంపొందించే దిశగా జాతీయ ఆయుష్ మిషన్ కాన్క్లేవ్ ఒక ముఖ్యమైన అడుగు. బలమైన మరియు సమగ్రమైన ఆయుష్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా అందరికీ సమగ్ర ఆరోగ్యం అనే మన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి దార్శనికతను ముందుకు తీసుకెళ్లడమే మా లక్ష్యం" అని అన్నారు.

భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో ఆయుర్వేదం, యోగా ఽ ప్రకృతి వైద్యం, యునాని, సిద్ధ, సోవా-రిగ్పా మరియు హోమియో పతిలలో తాజా పరిణామాలు, పరిశోధన ఆవిష్కరణలు మరియు రంగాల సహకారాలను చర్చించడానికి జాతీయ ఆయుష్ మిషన్ కాన్క్లేవ్ ఒక శక్తివంతమైన వేదికగా పనిచేయ నుంది. ఇది ప్రధాన కార్యక్రమాల అమలును బలోపేతం చేయడం, ఆధారాల ఆధారిత పద్ధతులను ప్రోత్సహించడం మరియు అంతర్జాతీయ విస్తరణను మెరుగుపరచడంపై కూడా దృష్టి పెడుతుంది. ఔంఓ పథకం యొక్క భవిష్యత్తు విస్తరణను పరిష్కరించడానికి మంత్రుల స్థాయి చర్చలను ఈ కాన్క్లేవ్ లక్ష్యంగా పెట్టుకుంది.

ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటేచా మాట్లాడుతూ, "జాతీయ ఆయుష్ మిషన్ సాధించిన విజయాలను ప్రతిబింబించడానికి, ఉద్భవిస్తున్న సవాళ్లను పరిష్కరించడానికి మరియు స్వావలంబన మరియు బలమైన ఆయుష్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ వైపు ఒక మార్గాన్ని రూపొందించడానికి ఆయుష్ మంత్రిత్వ శాఖ NAM కాన్క్లేవ్-2025ను నిర్వహిస్తోంది" అని అన్నారు.

ఈ కాన్క్లేవ్ యొక్క ఇతివృత్తాల గురించి మాట్లాడుతూ, ఆయుష్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీమతి కవితా గార్గ్ మాట్లాడుతూ, "ఈ కాన్క్లేవ్ ఆర్థిక నిర్వహణ, పర్యవేక్షణ మరియు మూల్యాంకనం, హెచ్ఆర్ బలోపేతం, ఆధునిక వైద్యంతో ఏకీకరణ మరియు నాణ్యత హామీ వంటి విభిన్న అంశాలను కవర్ చేస్తుంది. ఇది రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల నుండి గొప్ప అనుభవ భాగస్వామ్యంతో ఉత్తమ పద్ధతులు, ఐటి ఆవిష్కరణలు, నియంత్రణ యంత్రాంగాలు మరియు పెట్టుబడి మరియు ఎగుమతి అవకాశాలను కూడా ప్రదర్శిస్తుంది."

# వాషింగ్టన్‌లో భారత మరియు అమెరికా అధికారులు సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై కొనసాగుతున్న చర్చలలో భాగంగా, భారత వాణిజ్య శాఖ మరియు అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం ప్రతినిధులు 23-25 ??ఏప్రిల్ 2025 వరకు వాషింగ్టన్, డి.సి.లో సమావేశమయ్యారు. ఇది మార్చి, 2025లో న్యూఢిల్లీలో జరిగిన మునుపటి ద్వైపాక్షిక చర్చల తరువాత జరిగింది. వాషింగ్టన్, డి.సి.లో జరిగిన సమావేశాల సందర్భంగా, సుంకం మరియు సుంకం కాని అంశాలపై విస్తృత శ్రేణి అంశాలపై బృందం ఫలవంతమైన చర్చలు జరిపింది. 2025 శరదృతువు నాటికి పరస్పర ప్రయోజనకరమైన, బహుళ-రంగ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం యొక్క మొదటి దశను ముగించే మార్గాన్ని బృందం చర్చించింది, ఇందులో ముందస్తు పరస్పర విజయాల అవకాశాల ద్వారా కూడా ఉంటుంది. ఉత్పాదక రంగాల నిపుణుల స్థాయి సమావేశాలు వర్చువల్ ఫార్మాట్ ద్వారా జరిగినప్పటికీ, మే చివరి నుండి వ్యక్తిగత రంగాల సమావేశాలు ప్రణాళిక చేయబడ్డాయి.

# శివసేన (ఉద్ధవ్ బాల సాహెబ్ థాక్రే) తెలంగాణ రాష్ట్రం నూతన కమిటీ



హైదరాబాద్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్రంలో పార్టి బలోపేతం మే లక్ష్యంగా ప్రతి ఒక్క నాయకుడు పనిచేయాలని శివసేన (ఉద్ధవ్ బాల సాహెబ్ థాక్రే) తెలంగాణ రాష్ట్రం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ బాతరాజు సూచించారు. మంగళవారం కాచిగూడ పార్టి కార్యాలయంలో జరిగిన రాష్ట్ర పదాదికరుల సమావేశం జరిగినది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి మార్గదర్శనం చే శారు. అదేవిధంగా నూతన రాష్ట్ర కోర్ కమిటీ ని ప్రకటించారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులుగా 1) అవినీష్ జైశ్వాల్ 2 ఆంధ్రపు సుదర్శన్ రాష్ట్ర ప్రాధనా కార్యదర్శి3 కేశవ్ గుప్త 4 పూస శ్రీనివాస్ 5 గౌట్ గణేష్. ఎన్నుకోవడం జరిగింది. ఇ కార్యక్రమంలో హైదరాబాదు నగర ఉపాధ్యక్షులు వంశీదర్ మహేష్ కుమార్ అధికార ప్రతినిధి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి . విద్యార్థి సేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# బస్టాప్ లోకి దూసుకెళ్లిన వాహనం.. స్పాట్ లోనే ఇద్దరు నర్సింగ్ విద్యార్థుల మృతి



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29:గద్వాల జిల్లా కేంద్రంలో నర్సింగ్ కాలేజీ విద్యార్థినీలు కాలేజీ ముగిసిన తర్వాత హాస్టల్ కు వెళ్లేందుకు కొత్త హౌసింగ్ బోర్డ్ టర్నింగ్ బస్టాప్ దగ్గర బస్సు కోసం ఆగారు. అంతలో ఓ వాహనం వారిపై నుంచి దూసుకెళ్లింది. దీంతో మక్తల్ కు చెందిన మహేశ్వరి, వనపర్తికి చెందిన మనిషా స్పాట్ లోనే మృతి చెందారు.

మరో ఇద్దరు విద్యార్థినీలతో పాటు మరో ఇద్దరు చిన్నారులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనను తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎస్పీ టి.శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ లు ప్రమాద సంఘటనను పరిశీలించారు. అనంతరం హాస్పిటల్ కు వెళ్లి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 'కాళేశ్వరం' కమిషన్ గడువు పెంపు

కాళేశ్వరం. ఏప్రిల్ 29: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై న్యాయవిచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును తెలంగాణ ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ప్రస్తుత గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో ఈ ఏడాది మే 31వరకు గడువు పెంచుతూ ఇవాళ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 100రోజుల్లో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని తొలుత 2024 మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత ఆ యా కారణాలతో విచారణ కంటిన్యూ అవుతూ ఉంది. ఇప్పటికే పలు సందర్భాల్లో గడవు పొడిగించిన ప్రభుత్వం తాజాగా మరోసారి పెంచింది. ప్రస్తుతం విచారణ కీలక దశకు చేరుకుంది. దాదాపు 90శాతం నివేదిక సైతం కమిషన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. తుది దశ విచారణలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం లోని కొంతమంది పెద్ద నాయకులను కూడా పిలిచే అవకాశముందని తెలుస్తోంది.

# వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి.. రైతుల రాస్తారోకో



మెదక్, ఏప్రిల్ 29:అధికారులు హంగు ఆర్భాటాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, తూకం వెయ్యడం పూర్తిగా మరిచిపోయారంటూ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహించిన వెల్దుర్తి మండలంలోని ఉప్పు లింగాపూర్ గ్రామ రైతన్నలు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వెల్దుర్తి మెదక్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా బస్సులు, ట్రాక్టర్లు, భారీ వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కోతలు ప్రారంభమై నెలరోజులు గడుస్తుందని ఈనెల 17న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు కొనుగోలు చేపట్టడం పూర్తిగా మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజుల నుండి ధాన్యం కుప్పలపై రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న టాపర్లు పూర్తిగా చినిగిపోయి మళ్లీ కొత్తవి కొనుక్కునే దుస్థితి రైతులకు ఏర్పడిందని కొంతమంది రైతులు టాపర్ల కిరాయిలు కట్టలేని పరిస్థితి ఏర్పడిందని తీవ్రంగా మండిపడ్డారు.

కొంతమంది పేద రైతులు దళారులను ఆశ్రయించి 1800 రూపాయలకు క్వింటాలు ధాన్యాన్ని విక్రయించి తీవ్రంగా నష్టపోయారన్నారు. సోమవారం రాత్రి గ్రామానికి వచ్చిన హమాలీలను పిఎసిఎస్ సిబ్బంది బండ పోసానిపల్లి గ్రామానికి తరలించారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని సహకార సంఘం సిబ్బందిని కోరినా స్పందించలేదన్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించామన్నారు. అకాల వర్షాలు ఈదురుగాలులతో ధాన్యం తడిసి ముద్దవుతుందని, తిండి తిప్పలు లేకుండా రాశుల వద్దే కాపలా ఉండాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడిందని వాపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, సహకార సంఘం సిబ్బంది గ్రామానికి చేరుకొని రైతులతో మాట్లాడి గ్రామం నుండి వెళ్లిన హమాలీలను వెనక్కి రప్పించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

# అభివృద్ధి,సంక్షేమం సమ ప్రాధాన్యతగా ప్రజాప్రభుత్వం పాలన: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**- జూన్ 2న యువతకు రాజీవ్ యువవికాసం పథకం అమలు**

**- నేలకొండపల్లిమండలంలో పర్యటించి రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి**



ఖమ్మం, ఏప్రిల్ 29 (నేటినిజం ప్రతినిధి) :అభివృద్ధి, సంక్షేమం సమ ప్రాధాన్యతగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి నేలకొండపల్లి మండలంలో పర్యటించి నాచేపల్లి గ్రామంలో కొత్త కొత్తూరు నుండి వల్లభి వరకు ప్లాన్ నిధులు 40లక్షలతో చేపట్టిన రోడ్డు మరమ్మత్తు పనులకు, సుర్దేపల్లి గ్రామంలో సుర్దేపల్లి నుండి కిష్టారం హై లెవెల్ బ్రిడ్జి వరకు 35లక్షలతో చేపట్టిన రోడ్డు మరమ్మత్తు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ...గత పాలకుల వైఫల్యాల కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పేదల అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత నిస్తూ, రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని అన్నారు. ఆర్థిక వ్యవస్థను బాగు చేసుకుంటూ, పేదవాడి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు మన మధ్యలో ఉన్నాయని అన్నారు. రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం సరఫరా, 200యూనిట్ల ఉచిత విద్యుత్, 500రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేశామని అన్నారు. రాబోయే రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న యువతకు రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని అన్నారు. వరదల వల్ల ఇబ్బందులు పడకుండా 40లక్షల రూపాయలతో కొత్త కొత్తూరు నుండి వల్లభి వరకు సిసి రోడ్డు నిర్మించుకుంటున్నా మని, రాబోయే 45రోజుల గడువు లోగా ఈ పనిని పూర్తి చేసుకుంటామని అన్నారు. వరదలకు దెబ్బతిన్న రోడ్డులో పూర్తి స్థాయిలో పనులు చేశామని, గ్రామాలలో అవసరమైన చోట్ల నూతన రోడ్ల నిర్మాణం పూర్తి చేసామని, పెండింగ్ ఉన్న చిన్న రోడ్డు పనులు కూడా భవిష్యత్తులో పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ఈఈ యుగంధర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంస్థ అభివృద్దే ప్రతి ఉద్యోగి లక్ష్యం కావాలి..

**-చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కే. కవిత పిలుపు**

**- డిపోలో ప్రగతి చక్ర అవార్డుల పురస్కారాల ప్రదానం**

**- అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులకు అభినందన**



హైదరాబాద్ (చెంగిచెర్ల) ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆర్టీసీ సంస్థ అభివృద్దే ప్రతి ఉద్యోగి లక్ష్యం కావాలని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే. కవిత పిలుపునిచ్చారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో ప్రగతి చక్ర అవార్డుల పురస్కారాలలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులకు అభినందన సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు, ఇందనం ఆదాచేసిన డ్రైవర్లు, బస్సులను సక్రమంగా మెయింటెనెన్స్ చేసిన మెకానిక్ లను శాలువాలతో సన్మానించి నగదు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కవిత మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేసినప్పుడే ఆదాయం పెంచుకోగలుగుతామన్నారు. డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలను నివారించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రయాణికులను ఆదరించి వారి మన్నలను పొందడం ద్వారా ఆదాయాన్ని మరింత పెంచుకోవచ్చని సూచించారు. సమయపాలనకు పాటించి ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) చంద్రమౌళి, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) శేషి రెడ్డి, ఈడబ్ల్యుబి సభ్యులు పద్మావతి, వెంకటేష్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు..

# బిఆర్ అంబేద్కర్ ప్రజాసంక్షేమసంఘం 25ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా

# ఖమ్మం పట్టణంలో భారీ ర్యాలీ సభ నిర్వహించిన లింగాల రవికుమార్




ఖమ్మం, ఏప్రిల్ 29 (నేటినిజం ప్రతినిధి) :బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం 25సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మం పట్టణంలో కోలాటం, డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించి జడ్పీ సెంటర్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ లో సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ మాట్లాడుతూ...డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణకై దేశవ్యాప్తంగా అంబేద్కర్ ప్రజా చైతన్య బాట నిర్వహిస్తామని లింగాల రవికుమార్ తెలిపారు. 1999లో అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘాన్ని స్థాపించి గత 25ఏళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు ఉద్యమాలు నిర్వహించామని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి, వర్ధంతి సభలు విగ్రహ ఆవిష్కరణలు ద్వారా అంబేద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను ప్రచారం చేయడం జరిగిందని 2004లో దళిత, గిరిజన చైతన్య సదస్సులు ప్రజా చైతన్య బేరి కార్యక్రమాలు నిర్వహించి పలు ఉద్యమాలు చేపట్టామని 2006లో విజయవాడలో అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహించి రాష్ట్రంలో విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, రైతు, ప్రజా సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారానికి నాటి ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగిందని 2008లో అంబేద్కర్ చైతన్య యాత్ర అంబేద్కర్ చైతన్య బాట కార్యక్రమాల నిర్వహించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇతర పేద వర్గాల విద్య, వైద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక సాంస్కృతిక రంగాలలో చైతన్య పరుస్తూ విద్యార్థి యువజన మహిళా కార్మిక రైతు ప్రజా సంక్షేమం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరిగిందని లింగాల తెలిపారు. అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ గా కుల వివక్షత పై దళిత గిరిజనులపై దాడులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేశామన్నారు.

2005లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు సెమినార్లు నిర్వహించి విద్యార్థులలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించి విద్యార్థులకు అంబేద్కర్ మెమెంటోలు నగదు బహుమతులు అందజేయడం జరిగిందని రవికుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులు దారి మళ్ళించకుండా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఖర్చు చేయాలని ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ఉద్యమాలు నిర్వహించామని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ బహుజన బేరి సభలు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి శ్రీకృష్ణ కమిటీకి అధికారికంగా నివేదిక అందజేసి రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలతో కలిసి అనేక ఉద్యమాలు నిర్వహించామని రవికుమార్ మాట్లాడారు. సేవా కార్యక్రమాలలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరిగిందని రక్తదాన శిబిరాలు నిర్వహించి క్షతగాత్రులను ఆదుకోవడం జరిగిందని ప్రభుత్వ ఆసుపత్రులలో పండ్లు పంపిణీ అన్నదాన కార్యక్రమాలు వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి త్రాగునీరు అందించడం జరిగిందని బాలలకు, వృద్ధులకు, మహిళలకు వస్త్రాలు పంపిణీ కరోనా లాక్ డౌన్ సమయంలో పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ లాంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని రవికుమార్ తెలిపారు. గత 25ఏళ్లుగా బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొన్న ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారులు మండల డివిజన్ అధికారులు ప్రజా ప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నేతలకు లింగాల రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ... 1999లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రవికుమార్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘాన్ని స్థాపించారని అప్పుడు ఇప్పుడు ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని రవికుమార్ అన్ని వర్గాలను కలుపుకొని అంబేద్కర్ ఆశయాల సాధన కోసం కృషి చేస్తూ అందరి మన్ననలను పొందారని తెలిపారు. సభ ప్రారంభంలో కాశ్మీర్లోని పెహల్గామ్ టెర్రరిస్టు ముష్కరుల కాల్పులలో మరణించిన వారికి సంతాపం ప్రకటించి టెర్రరిస్టులను పట్టుకొని కఠినంగా శిక్షించి కాల్చి చంపాలని రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

# నూతన యన్.సి.సి. కల్నల్ అధికారిని సన్మానించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



కరీంనగర్, ఏప్రిల్ 29: (నేటినిజం ప్రతినిధి) స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హై స్కూల్ కు విచ్చేసినటువంటి నూతనంగా నియమింపబడిన కల్నల్ అధికారి ఎ.కె.జయంత పాఠశాలకు విచ్చేసిన సందర్భంగా అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యన్.సి.సి విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా మరియు సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నదని తెలుపుతూ యన్.సి.సి వారి విధివిధానాలు చాలా ప్రశంసనీయమైనవని మరియు పౌరులకు రక్షణ కవచంలాంటివని వారు అభివర్ణించారు. నూతనంగా నియమితులైన కల్నల్ అధికారి ఎ.కె. జయంతకి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని మరియు వారి ఆధ్వర్యంలో నిర్వహించబడే వివిధ కార్యక్రమాలకు చేయూతనిస్తామని మరియు విద్యార్థులను కూడా అధిక సంఖ్యలో ప్రోత్సహించి కార్యక్రమాలను విజయవంతం చేస్తామని చెప్పారు. జయంత మాట్లాడుతూ అల్ఫోర్స్ పాఠశాలలో యన్.సి.సికి సంబంధించిన ప్రణాళికలను చాలా చక్కగా రూపొందించడమే కాకుండా వాటిని సకాలంలో అమలుపరుస్తున్నారని ప్రశంసిస్తు పాఠశాల పాఠ్యాంశ ప్రణాళికల్లో భాగంగా విద్యార్థులకు పలు నైతిక విలువలతో పాటు దేశ రక్షణకు సంబంధించిన విషయాలు భోదించడం చాలా గర్వించదగ్గ విషయమని చెప్పారు.పాఠశాల అధినేత నరేందర్ రెడ్డి గారి సారధ్యంలో విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణను ఇవ్వడం జరుగుతున్నదని, సమాజ హితమైనవని మరియు సమాజ అభివృద్ధికి తోడ్పడుతాయని ప్రశంసించారు.

అంతకు ముందు వారు వారికి పూల మొక్కను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, యన్.సి.సి. అధికారులు పాల్గొన్నారు

# వేసవి పాఠశాలలను విజయవంతం చేయాలి : ఎంఈఓలు

పెద్దపల్లి, ఏప్రిల్ 29 : పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డీఈఓ పర్యవేక్షణలో మునుపెన్నడూ లేని విధంగా మే 1న ప్రతిష్టాత్మకంగా ప్రారంభంకానున్న వేసవి పాఠశాలల్ని వాలంటీర్లు విజయవంతం చేయాలని శ్రీరాంపూర్, ఓదెల మండలాల విద్యాధికారులు (ఎంఈఓలు) సిరిమల్ల మహేష్, యర్రా రమేష్ కోరారు. ఇవాళ శ్రీరాంపూర్ జడ్పీ హైస్కూల్‌లో వేసవి బడుల ఒక రోజు శిక్షణా కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. వాలంటీర్లుగా పని చేసిన వారికి గౌరవ వేతనం ఉంటుందన్నారు. జూన్ 10వ తేదీ తర్వాత జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు. శ్రీరాంపూర్ ఓదెల, మండలాల్లో వేసవి పాఠశాలలు ఏర్పాటు చేసిన గ్రామాల్లోని పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల్ని వేసవి బడులకు పంపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ సంధి సంపత్ రెడ్డి, టీం లీడర్ సమీద్ కాంప్లెక్స్, హెచ్ఎంలు నరెడ్ల సునీత, డి.సత్యలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, ఓదెల, శ్రీరాంపూర్ మండలాల వాలంటీర్లు, పలువురు పాల్గొన్నారు.



# బాల్య వివాహాలను అరికట్టాలి -ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదారాణి

కట్టంగూర్, ఏప్రిల్ 23 : బాల్య వివాహాలను ఆరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బూరుగు శారదారాణి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కట్టంగూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లలు అనారోగ్యానికి గురైతారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను ఈ సందర్భంగా వివరించారు. అనంతరం బాల్య వివాహ విముక్త భారత్ ప్రతిజ్ఞ చేసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, పూజారి యుగేందర్ శర్మ, కో ఆర్టినేటర్ శోభారాణి, ఝాన్సీ, అశ్రీత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# త్రివిధ దళాధిపతులతో మోదీ ఉన్నత స్థాయి సమావేశం..



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత, జమ్మూ కాశ్మీర్‌లో భద్రతను కట్టుదిట్టం చేయడానికి కేంద్రం అన్ని చర్యలు తీసుకుంటోంది. సరిహద్దుల్లో నిఘా పెంచడం, అదనపు బలగాలను మోహరించడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు దేశ భద్రతా పరిస్థితిపై అత్యున్నత స్థాయి సమీక్షలు జరుగుతున్నాయి.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు (మంగళవారం) తన నివాసంలో ఉన్నత స్థాయి భద్రతా సమావేశాన్ని నిర్వహించారు.

రేపు (బుధవారం) భద్రతా వ్యవహారాల కేంద్ర క్యాబినెట్ కమిటీ (అఊా) మరొక సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ కీలకమైన సమావేశానికి ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ త్రివిధ దళాల అధిపతులు ఈరోజు మోడీ నివాసంలో సమావేశమవడం గమనార్హం. ఈ సమావేశంలో, దేశ అంతర్గత భద్రత, ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితి గురించి విస్తృతంగా చర్చించారు.

దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశంలో ప్రధాని మోదీ కీలక వాఖ్యాలు చేశారు. ఉగ్రవాదాన్ని అణచివేయడం జాతీయ సంకల్పమని ప్రధాని పునరుద్ఘాటించారు.

పహల్గామ్ దాడికి తగిన సమాధానం ఉంటుందని ప్రధాని అన్నారు. భారత సాయుధ దళాల సామర్థ్యాలపై తమకు పూర్తి నమ్మకం ఉందని.. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి భారత సాయుధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు.

## రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మం, ఏప్రిల్ 29:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసించిన 2007-10 బ్యాచ్ సివిల్ డిప్లొమా విద్యార్థులు మంగళవారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 15 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ద్వారా కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రస్తుత ప్రిన్సిపల్, మాజీ సివిల్ లెక్చరర్ వెంకటేశ్వర్లు, వరంగల్ పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ న్యూరి, ఫిజిక్స్ లెక్చరర్ వినోద్, డ్రాయింగ్ లెక్చరర్ సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఉద్యోగి పాషా, ఇతర అధ్యాపకులను వారు ఘనంగా సన్మానించారు.

ప్రిన్సిపాల్ సూచన మేరకు కళాశాల భవన మరమ్మతులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన తమ తోటి స్నేహితుడు నాగేశ్వరరావు, తమకు విద్యాబుద్ధులు నేర్పిన సివిల్ హెచ్ఓడీ సత్యనారాయణ రెడ్డికి నివాళులర్పించారు. నాగేశ్వరరావు కొడుకు విద్యావసరాల కోసం రూ.లక్ష వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మంతెన బాలకృష్ణ, బజార్, కీర్తి, స్వర్ణలత, సిద్ధార్థరెడ్డి, చైతన్య, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.ః

# నిరంతరం ప్రజల్లో ఉంటేనే గుర్తింపు లభిస్తుంది : మంత్రి సీతక్క




హైదరాబాద్, ఏప్రిల్ 29:నాయకులు నిరంతరం ప్రజల్లో ఉండి సేవలు అందిస్తేనే గుర్తింపు లభిస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. పోచారం మున్సిపాలిటీ చౌదరిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళా ప్రతినిధుల సదస్సు మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క పాల్గొన్నారు. నాయకులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల కష్టాల్లో పాలు పంచుకున్నప్పుడే ప్రజా నాయకుడిగా గుర్తుపెట్టుకుంటారని స్పష్టం చేశారు.

ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభ కనబరుస్తున్నారని మంత్రి సీతక్క అన్నారు. మహిళలకు మరింతగా స్వేచ్ఛనిస్తే, అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో విజయాలను సాధిస్తూ రాష్ట్ర, దేశ పురోగతిలో భాగస్వాములు అవుతారని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ, చాకలి అయిలమ్మ వంటి మహిళలను ఆదర్శంగా మరింత ఎక్కువ మంది మహిళలు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. మహిళలు రాజకీయాల్లో మరింత ఎక్కువ మంది ముందుకొస్తే రాష్ట్ర, దేశ పురోగాభివృద్ధి అనుకున్న విధంగా సాధ్యం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెహల్గాం మృతులకు సంతాపకంగా 2 నిమిషాలు మౌనం పాటించారు.

# మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్పించాలి: ఎస్పీ మహేశ్ గీతే



కరీంనగర్, ఏప్రిల్ 29: మత్తు పదార్థాలపై గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బీ గీతే పోలీస్ సిబ్బందికి సూచించారు. ఇవాళ ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు నమ్మకం, భరోసా కలిగించాలన్నారు.

స్టేషన్ పరిసరాలు, రికార్డులు, పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల వివరాలతోపాటు గతంలో జరిగిన సంఘటనల వివరాలు, స్టేషన్ల పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలతోపాటు సిబ్బంది నిర్వహించే విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా రౌడీ, హిస్టరీ షీటర్లతోపాటు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేస్తూ వారి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీయాలన్నారు.

మత్తు పదార్థాలపై, సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలకు, యువతకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, సేవించడం, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చేయాలన్నారు. అధికారులకు, సిబ్బందికి ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

## అనుమతులు లేకుండా వైద్య పరీక్షలు చేస్తే చర్యలు తప్పవు : వైద్యాధికారి ప్రమోద్ కుమార్

ఖమ్మం, ఏప్రిల్ 29: నిబంధనల ప్రకారమే క్లినిక్‌లను నిర్వహించాలని జగిత్యాల జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ పేర్కొన్నారు. ప్రమోద్ కుమార్ ఇవాళ వైద్యాధికారులతో కలిసి మెట్‌పల్లి పట్టణంలోని పలు క్లినిక్‌లలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి క్లినిక్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, అనర్హులైన వైద్యులతో రోగులకు చికిత్స అందిస్తున్నట్లు గుర్తించి క్లినిక్‌ను మూసివేయించారు.

క్లినిక్ నిర్వాహకులను స్థానిక పోలీసులకు అప్పగించారు. ప్రజలు అర్హులైన వైద్యుల ద్వారా చికిత్స చేయించుకోవాలని అనుమతులు లేకుండా వైద్య పరీక్షలు చేసినా, చికిత్సను అందించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఆకుల శ్రీనివాస్, మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేనిఫెస్టో మరచి పాలన : పాలడుగు సుధాకర్




ఖమ్మం, ఏప్రిల్ 29:మల్టి పర్పస్ రద్దు కోసం మే 19 నుండి జరిగే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె, అలాగే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరిగే సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయు కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు.

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, మ్యానిఫెస్టోలో పొందుపరచిన వాగ్దానాలను మరచి పాలన చేస్తున్నారని, మల్టి పర్పస్ రద్దు చేస్తామని, వేతనాలను పెంచుతామని, కార్మికులందరికీ పర్మినెంట్ చేస్తామని హామీలిచ్చి ఏ ఒక్కటి అమలు చేయకపోగా, కార్మికులపై మరిన్ని భారాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోపుతున్నదని విమర్శించారు.

ప్రభుత్వం అనేక నిర్బంధాలను ప్రయోగించినా ధైర్యంగా కార్మికులు ఎదుర్కొన్నారని, కార్మికుల ప్రాణాలకు అత్యంత ప్రమాదకారిగా ఉన్న మల్టిపర్పస్ రద్దు చేయాలని అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా 225 మంది కార్మికుల ప్రాణాలను కో?ల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

మల్టి పర్పస్ విధానం రద్దుపై ఇటీవల ప్రజా భవన్ సామూహిక రాయభారం సందర్భంగా నోడల్ ఆఫీసర్ ఇచ్చిన హామీ మేరకు త్వరలో ప్రభుత్వం చర్యలు జరిపి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల మే 19 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకి సిద్ధమవుతామని, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే విధంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని, వీటి అమలుకు రంగం సిద్ధమవుతున్నందున మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేసి కార్మిక శక్తి చూపించి, ప్రభుత్వ చర్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు సదానందం, వెంకన్న, దారయ్య, నాగరాజు, మాధవి, వీరమ్మ పాల్గొన్నారు.

# డీఎంహెచ్‌వోను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోండి.. కలెక్టర్ కోయ శ్రీహర్షకు టీఎన్జీవో విజ్ఞప్తి



కరీంనగర్, ఏప్రిల్ 29:డీఎంహెచ్ వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారిని బెదిరించి, భయభ్రాంతులకు గురి చేసిన వారిపై, గోదావరి ఖని మమత హాస్పిటల్ యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో వైద్య ఉద్యోగులతో కలిసి ఇవాళ మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాటాడుతూ.. ఈ నెల 26న డీఎంహెచ్‌వో విధి నిర్వహణలో భాగంగా గోదావరిఖనిలోని మమత హాస్పిటల్‌ను తనిఖీ చేయగా.. అందులో అనుమతి లేని అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను గుర్తించి సీజ్ చేస్తుండ గా,హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, ఇతర వ్యక్తులు కలిసి డీఎంహెచ్‌వోను భయభ్రాంతులకు గురి చేస్తూ చంపేస్తామని బెదిరించారని కలెక్టర్‌కు వివరించారు.ఆ దవాఖాన లో పని చేస్తున్న ప్రభుత్వ వైద్యులు నాగిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఆర్‌జే స్వాతిని సస్పెండ్ చేయాలని కోరారు. ఈ దౌర్జన్యంలో పాల్గొన్న డాక్టర్ బీ అనిల్ కుమార్‌పై తగిన చర్యలు తీసుకుంటూ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయుటకు మెడికల్ కౌన్సిల్ బోర్డుకు సిఫారసు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే మహం కాళిస్వామి, రిసెప్షనిస్ట్ ఆనంద్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహె చ్‌వోపై అక్రమ కేసు బనాయించిన ఆనంద్ కేసు ఉపసంహరించుకోవాలన్నారు. డీఎంహెచ్‌వోకు తగు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ బీ శ్రీరాములు, డాక్టర్ కిరణ్ కుమార్, టీఎన్జీవో హెల్త్ ఫోరం అధ్యక్షుడు వీరగోని శ్రీనివాస్, టీజీవో హెల్త్ ఫోరం అధ్యక్షుడు ఉమమహేశ్వర్, రాష్ట్ర పారామెడికల్ ఆఫీసర్ల ఫోరం అధ్యక్షుడు దేవీ సింగ్, ఆర్‌బీఎస్ కే వైద్యులు రమేష్, రాజేష్, సాలమ్మ, దయామణి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీలు వచ్చేలా చర్యలు : అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

మెదక్, ఏప్రిల్ 29 ఉపాధిహామీ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసి ఎక్కువ కూలీ డబ్బులు పొందాలని సంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఉపాధి హామీ కూలీలకు సూచించారు.

ఇవాళ ఝరాసంగం మండల కేంద్రం తోపాటు కుప్పానగర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్లను ఉపాధి హామీ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనులకు ఎక్కువ మంది కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులు చేసే ప్రాంతంలో సౌకర్యాల కల్పన, పని వేళలు తదితర వాటిపై ఆయన కూలీలతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులందరూ ఇల్లు నిర్మించుకునే లాగా చూడాలని అధికారులతో అన్నారు.

మా మండలానికి ఇంకో 68 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హనుమంతరావు అదనపు కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు.

ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సుధాకర్ , పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 29: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో రూ.2.93 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.మున్సిపాలిటీ సాధారణ నిధులతో రూ.2.92 లక్షలతో ఖానాపురం గ్రా మానికి చెందిన అన్ని వర్గాల ప్రజల అవసరార్థం కమ్యూనిటీ హాల్ నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చామని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తెలిపారు. గతంలోనూ ఖానాపురం గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# మే ఒకటి నుంచి మారనున్న రైల్వే రూల్స్..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29:మీరు తరుచూ రైలులో ప్రయాణిస్తుంటారా.. అయితే, ఈ వార్త మీ కోసమే. భారతీయ రైల్వే టికెట్ నిబంధనలు మార్చింది. మే ఒకటి నుంచి రైల్వే టికెట్ నిబంధనలను కఠినతరం చేయబోతున్నది. వెయిటింగ్ టికెట్లు ఉన్న ప్రయాణికులకు స్లీపర్ లేదంటే ఏసీ కోచ్‌లలో ప్రయాణించేందుకు అనుమతి ఉండదు. ప్రయాణికుడు వెయిటింగ్ టికెట్ ఉంటే.. జనరల్ కోచ్‌లలో మాత్రమే ప్రయాణించాల్సి ఉంటుంది. మే ఒకటి నుంచి కఠిన నిబంధనలు అమలు చేసిన తర్వాత.. ప్రయాణికులకు వెయిటింగ్ టికెట్లతో స్లీపర్, ఏసీ కోచ్‌లలో ప్రయాణించడంపై నిషేధం అమలులో ఉంటుంది. టికెట్ కన్ఫర్మ్ కాని ప్రయాణికులు స్లీపర్, ఏసీ కోచ్‌లలో వెయిటింగ్ టికెట్‌తో కనిపిస్తే.. టీటీఈ అతనికి జరిమానా విధించే అవకాశం ఉన్నది. లేకపోతే జనరల్ కోచ్‌కు పంపేందుకు అవకాశం ఉంటుంది.

కన్ఫర్మ్ టికెట్లతో ప్రయాణించే ప్రయాణికుల సౌలభ్యం కోసం మాత్రమే ఈ రూల్‌ని రూపొందించినట్లు నార్త్ వెస్టర్న్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కెప్టెన్ శశికిరణ్ పేర్కొన్నారు. టికెట్లు పొందిన ప్రయాణికులు వెయిటింగ్ టికెట్లు ఉన్న ప్రయాణికుల కారణంగా అసౌకర్యాన్ని ఎదుర్కోకూడదని తెలిపారు. సాధారణంగా వెయిటింగ్ టికెట్లు ఉన్న ప్రయాణికులు స్లీపర్, ఏసీ కోచ్‌లలోకి ప్రవేశించి.. కన్ఫర్మ్ టికెట్స్ ఉన్న ప్రయాణికుల బెర్తుల్లో కూర్చునేందుకు ప్రయత్నిస్తున్నారని.. దాంతో ఇతర ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందని రైల్వేశాఖ పేర్కొంది.స్లీపర్, ఏసీ కోచ్‌లలో వెయిటింగ్ టికెట్ల ప్రయాణికుల సంఖ్య పెరిగితే.. రైలులో రాకపోకలకు సైతం ఇబ్బంది అవుతుందని చెప్పింది. ప్రయాణికులకు అసౌకర్యం కలిగించడమే కాకుండా ప్రయాణాన్ని కష్టతరం చేస్తుందని తెలిపింది.

ఎవరైనా ఓ ప్రయాణికుడు స్లీపర్ కోచ్‌లో వెయిటింగ్ టికెట్‌తో ప్రయాణిస్తూ టీటీఈకి పట్టుబడితే అతనికి రూ.250 వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. దాంతో పాటు స్లీపర్ క్లాస్ టికెట్ ఛార్జీ మొత్తం వసూలు చేస్తారు. దూరాన్ని బట్టి అదనంగా చార్జీ సైతం చెల్లించాల్సి రావొచ్చు. మరో వైపు ఓ ప్రయాణికుడు థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లలో వెయిటింగ్ టికెట్‌తో ప్రయాణిస్తే.. మరింత ఎక్కువ జరిమానా చెల్లించాల్సిన పరిస్థితి ఉంటుంది. సదరు ప్రయాణికుడికి రూ.440 జరిమానా చెల్లించడంతో పాటు జనరల్ కోచ్‌కు పంపడం లేదంటే.. తర్వాత వచ్చే రైల్వేస్టేషన్‌లో దింపివేసే హక్కు టీటీఈకి ఉంటుంది. ఫస్ట్‌క్లాస్ ఏసీలో టికెట్ లేకుండా ప్రయాణించే వారికి భారీగా జరిమానా విధించేందుకు ఆస్కారం ఉంది. భారతీయ రైల్వే నిబంధనల ప్రకారం.. టికెట్ లేకుండా ప్రయాణించినందుకు గరిష్టంగా రూ.1000 జరిమానా, ఆరు నెలల వరకు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంటుంది.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి -హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక సెక్రటరీ

హైదరాబాద్, ఏప్రిల్ 29:ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన పేదలను గుర్తించాలని హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక సెక్రెటరీ(పిడి) వీపీ గౌతమ్ ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకంలో భాగంగా తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు మంఖాల్,10వార్డు , మహేశ్వరం మండలంలోని సిరిగిరిపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. లబ్దిదారుల వివరాలు ఇంటింటికీ తిరిగి తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా లబ్దిదారులతో వీపీ గౌతమ్ మాట్లాడారు. లబ్దిదారుల కుటుంబ ప్రస్తుత నివాస స్థితిగతులు, వారి ఆర్థిక పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. లబ్దిదారుల ఎంపిక వివరాల గురించి తెలుసుకున్నారు. నిజమైన లబ్దిదారుల దగ్గరకు అధికారులు వచ్చి వివరాలను సేకరించి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. ఇల్లు లేని పేద వారిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రతి లబ్దిదారుని ఇంటికెళ్లి కచ్చితమైన సర్వే చేసి ప్రభుత్వానికి అందించాలని సూచించారు.

# దేశ ఆర్థిక వ్యవస్థలో యువత పాత్ర కీలకం : ఓయూ రిజిస్ట్రార్

హైదరాబాద్, ఏప్రిల్ 29: దేశ ఆర్థిక వ్యవస్థలో యువత పాత్ర కీలకమని ఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ నరేశ్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఆడిటోరియంలో మంగళవారం నాడు నేషనల్ సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో ఓయూ రిజిస్ట్రార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ నరేశ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో భారత దేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు. పలు రకాలుగా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తుందని పేర్కొన్నారు.

యువత ఆర్థిక వ్యవస్థపై అధ్యయనం చేస్తూ రాష్ట్రాన్ని, దేశాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఓయూ రిజిస్ట్రార్ నరేశ్ రెడ్డి అన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఓబుల్ రెడ్డి, అప్పారావు, కేశవ్ మెమోరియల్ విద్యాసంస్థల డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శాంతి పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.